# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక


RANGAREDDY, EDITION : 01, VOLUME :114 EDITOR:CHERUKU UPENDAR, DATE : WEDNESDAY 30 AUGUST 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 114 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : బుధవారం 30 ఆగస్టు 2023 పేజీలు : 4 వెల : 5/-


## సెప్టెంబర్‌లో వర్షాలు లేనట్టేనా..!

### ఆందోళన వ్యక్తం చేస్తున్న వాతావరణశాఖ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



ఎనిమిదేళ్ల తర్వాత ఈ ఏడాది రుతుపవనాలు అత్యంత బలహీనంగా మారాయి. ఎల్‌నినో ప్రభావం కారణంగా సెప్టెంబర్‌లోనూ వర్షాలు ఎక్కువగా కురిసే అవకాశం లేదని, ఇప్పటికే ఆగస్టు నెలంతా వాతావరణం పొడిగానే ఉందంటూ

మిగతా 2లో...

గ్యాస్ బండ

## ధర తగ్గిస్తోన్న కేంద్రం



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

సామాన్యుడికి గుడ్‌న్యూస్! మహిళలకు రాఖీ గిఫ్ట్! కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించింది. ఒక్కో సిలిండర్‌పై రూ.200 వరకు కత్తిరించింది. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పరిధిలోని వారికి రూ.400 వరకు లబ్ధి చేకూరుతుందని తెలిపింది. ఇతరులకు రూ.200 వరకు ఆదా అవ్వనుంది.
ప్రస్తుత తగ్గింపుతో కేంద్ర ప్రభుత్వానికి 2022-23లో రూ.6100 కోట్లు,

మిగతా 2లో...

# జిల్లాలపై.... బీఆర్ఎస్ నిఘా




ఖమ్మం- ప్రభాత సూర్యుడు


అన్ని పార్టీల కంటే ముందే అభ్యర్థులను ప్రకటించిన బిఆర్ఎస్ ఖమ్మం జిల్లాపై ఫోకస్ పెట్టింది. జిల్లాలోని పదికి పది స్థానాలను కైవసం చేసుకోవడానికి కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఖమ్మం జిల్లా నేతలకు అర్జెంటుగా వచ్చి నన్ను కలవాలని కబురు పంపారు. ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ గూటికి చేరిన పొంగులేటి అక్కడ బలమైన నేత. కాంగ్రెస్ పార్టీకి మంచి పట్టు ఉంది. పొత్తు లేదని డిక్లేర్ కావడంతో ఉభయ కమ్యూనిస్ట్ పార్టీలు ఒంటరిగానే పోటీ చేయాలని డిసైడ్ అయ్యాయి. ఓవైపు కాంగ్రెస్, మరో వైపు ఉభయ కమ్యూనిస్ట్ పార్టీలు బలంగా ఉన్న ఖమ్మం జిల్లాలో బిఆర్ఎస్ కు పట్టు లేదనే చెప్పాలి. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర రావ్ పాలేరు సీటు ఆశించి భంగ పడ్డారు. తెలుగు దేశం పార్టీలో అత్యంత బలమైన నేతల్లో తుమ్మల ఒకరు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి కేసీఆర్ మాటలకు ఆకర్షితులై టిఆర్ఎస్ లో చేరారు. ఏరు దాటక ముందు వీర మల్లన్న ఏరు దాటాక బోడి మల్లన్న అనే రకం కేసీఆర్. గత ఎన్నికలలో ఖమ్మం జిల్లాలో కేవల ఒకే ఒక స్థానం గెలుచుకున్న కారు పార్టీ జిల్లాలో 10 స్థానాలు గెల్చుకోవడం సందేహాస్పదమే. ఎందుకంటే నిన్న తుమ్మల నాగేశ్వర రావ్ చేపట్టిన బల ప్రదర్శన బిఆర్ఎస్ కు ముచ్చెమటలు పుట్టిస్తోంది. గులాబీ జెండాలు లేకుండానే ఆయన బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లాలో బలమైన నేత చేజారిపోవడం ఖాయమని తెలుస్తోంది. తుమ్మల కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు మరో

మిగతా 2లో...

ప్రపంచంలోనే అత్యంత అధిక

## కాలుష్యం నగరంగా ఢిల్లీ నమోదు

ప్రజల ఆయుష్షు 12 ఏళ్లు తగ్గిపోనున్నట్లు స్టడీ లో వెల్లడి



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

ప్రపంచంలోనే అత్యంత అధిక కాలుష్యంఉన్న నగరంగా ఢిల్లీ నమోదు అయ్యింది. ఇక ఆ నగరంలో నివసిస్తున్న ప్రజల ఆయుష్షు 12 ఏళ్లు తగ్గిపోనున్నట్లు స్టడీ పేర్కొన్నది. చికాగోలోని ఎనర్జీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ ఎయిర్ క్వాలిటీ లైఫ్ ఇండెక్స్‌పై డేటాను రిలీజ్ చేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ

మిగతా 2లో...

బీఆర్ఎస్ జాబితాలో ...

## మార్పులు చేర్పులు తప్పవా !?

- ప్రకటించిన అభ్యర్థుల్లో ఆందోళన !!
- ప్రకటించిన జాబితాలోని సుమారు 20 మంది అభ్యర్థులకు బీఫామ్ కష్టమేనా?
- మంత్రి కేటీఆర్ విదేశాల నుంచి వచ్చిన తర్వాత కీలక నిర్ణయం



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తొలి, మలి అని లేకుండా ఒకటే జాబితాలో ఏకంగా 115 మంది అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ వారిలో కొందరిని చివరి నిమిషంలో మార్చేస్తారా..? సుమారు 20 మందికి బీఫామ్ ఇవ్వడం కష్టమేనా..? ఆ స్థానాల్లో కొందరు


మిగతా 2లో...

మైనంపల్లికి

## దారి దొరికినట్లేనా..!

### కీలక నిర్ణయం తీసుకునే దిశగా గులాబీ బాస్..

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో పొలిటికల్ హీట్ పెంచింది బీఆర్ఎస్ పార్టీ. ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయకముందే 115 అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్ పార్టీ.. ఈ వారంలో మిగిలిన నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు(కేసీఆర్) అభ్యర్థులను ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే, బీఆర్ఎస్ తొలి జాబితా విడుదలకు ముందే తన కుమారుడికి సైతం టికెట్ కేటాయించాల్సిందే.. లేకుంటే తానేంటో చూపిస్తానన్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుపై ఓ నిర్ణయం తీసుకునేందుకు రెడీ


మిగతా 3లో...

## దేశ నిర్మాణంలో భాగం అవుతా..!

### - ఢిల్లీలో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు !

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

దేశ నిర్మాణంలో భాగం అవుతానని అది ఎలా అనేది కాలమే నిర్ణయిస్తుందని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన ఆయన జాతీయ రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. 1980ల నుంచే టీడీపీ జాతీయ కూటమిల్లో భాగంగా ఉందని గుర్తు చేశారు. ఇండియా కూటమి ఎలా ముందుకు వెళ్తుందో చూడాల్సి ఉందన్నారు. ఇండియా కూటమికి లీడర్ లేకపోవడం బీజేపీ కి అనుకూల అంశమని.. ఇండియా కూటమికి నాయకత్వం ఎవరు వహిస్తారు అనేదానిపై కామెంట్




చేయనని స్పష్టం చేశారు. ప్రపంచంలో భారత్‌కు

మిగతా 2లో...

వినాయక చవితికి

## భాగ్యనగరం ముస్తాబు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



హైదరాబాద్ లో వినాయక చవితి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి తలసాని ఆదేశించారు. వచ్చే నెల 19న గణేష్ చతుర్థి నిర్వహించాలని భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులు నిర్ణయించారు. హైదరాబాద్ లో గణేష్ చతుర్థి ఉత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. సెప్టెంబర్ 19న వినాయక చవితి పండుగ నిర్వహించాలని సూచించింది. సెప్టెంబర్ 28న నిమజ్జనం ఉంటుందని స్పష్టం చేసింది. ఈ ఏడాది గణేష్ చతుర్థి ఏ రోజున జరుపుకోవాలనే సందేహం నెలకొంది. సెప్టెంబర్ 18వ తేదీన మధ్యాహ్నం చవితి మొదలై 19వ తేదీ మధ్యాహ్నం వరకు కొనసాగుతోంది. సూర్యోదయం తర్వాత వచ్చిన తిథినే పండుగ రోజుగా గుర్తిస్తామని భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులు తెలిపారు. కాబట్టి 19వ తేదీన సంప్రదాయబద్ధంగా వినాయక చవితి నిర్వహించుకోవాలన్నారు. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో వినాయక చవితి ఏర్పాట్లు, మండపాల నిర్వహణపై మంత్రి తలసాని శ్రీనివాస్

మిగతా 2లో...

## తెలంగాణ కుటుంబ ఇంటి పెద్ద కేసీఆర్

### మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

వేల్పూర్- ప్రభాత సూర్యుడు

ముఖ్యమంత్రి కేసీఆర్ జనరంజక పాలన,సంక్షేమ కార్యక్రమాలు,బాల్కొండ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై ముప్కాల్ మండలం రేంజర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్,బిజెపి నాయకులు,తటస్థులు మరియు ఏర్గట్ల మండలం నాగేంద్ర నగర్ గ్రామం కాంగ్రెస్,బిజెపిల నుండి పలువురు యువకులు సుమారు 200 మంది మంగళవారం రాష్ట్ర రోడ్లు




భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో భారత రాష్ట్ర సమితి పార్టీలో చేరారు. వారికి గులాబీ

మిగతా 3లో...

వాలంటరీ రిటైర్మెంట్‌కు

## దిశ అధికారి



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశా ఎన్కౌంటర్ కేసు దర్యాప్తు అధికారి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకోవడం చర్చనీయంగా మారింది. దేశవ్యాప్తంగా కీలకంగా మారిన దిశ ఘటనని షాద్‌నగర్ ఏసీపీ గా ఉండి ఇన్వెస్టిగేషన్ చేసిన సురేందర్ రాజీనామా పోలీస్ శాఖలో కలకలం రేపింది. సీనియర్ ఐపీఎస్ అధికారి సజ్జనార్ నేతృత్వంలో జరిగిన ఈ ఎన్కౌంటర్?పై

మిగతా 3లో...

# సెప్టెంబర్‌లో వర్షాలు లేనట్టేనా..!

(మొదటి పేజీ తరువాయి)

వాతావరణ శాఖ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వాస్తవానికి ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా వచ్చాయి. దీంతో దేశంలో ఈ ఏడాది జూన్‌లో లోటు వర్షాపాతం ఏర్పడింది. ఆ తర్వాత రుతుపవనాలు చురుగ్గా మారడంతో దేశవ్యాప్తంగా అత్యధిక వర్షాపాతం నమోదైంది. జులైలో 489.9 మిల్లీమీటర్ల వర్షాపాతం రికార్డు కాగా.. లోటు తీరినట్లయ్యింది.సాధారణ సగటు కంటే జూన్‌లో తొమ్మిది శాతం తక్కువ లోటు ఉండగా.. జులైలో 13శాతం ఎక్కువగా నమోదైంది. మరో వైపు సెప్టెంబర్ 17 నుంచి రుతుపవనాలు వెనక్కి మళ్లనున్నారు. రుతుపవనాల ఉపసంహరణ ఆలస్యం కారణంగా గత నాలుగేళ్లుగా సెప్టెంబర్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షాపాతం నమోదవుతున్నప్పటికీ.. తూర్పు, ఉత్తరాది రాష్ట్రాల్లో సాధారణం కంటే తక్కువ వర్షాలు ఉంటాయని వాతావరణశాఖ అంచనా వేస్తున్నది. వార్షిక సగటు వర్షాపాతంలో 70శాతం రుతుపవనాల సమయంలోనే నమోదు అవుతుండడం గమనార్హం. వర్షాపాతం తగ్గితే నిత్యావసర చక్కెర, పప్పులు, కూరగాయల ధరలు పెరిగే అవకాశం పెరిగే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**తెలంగాణలో 1972 తర్వాత..**

తెలంగాణలో 1972 తర్వాత ఆగస్టులో తెలంగాణలో అత్యల్పంగా వర్షాపాతం నమోదైంది. ఆగస్టులో కేవలం 74.4 మిల్లీమీటర్ల వర్షాపాతం మాత్రమే నమోదు కాగా.. ఇది సాధారణం కంటే 60శాతం తక్కువ. 1960 నుంచి రాష్ట్రంలో ఇంత తక్కువగా వర్షాపాతం నమోదవడం ఇది మూడోసారి. 1960లో 67.9 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదవగా.. 1968లో 42.7 మిల్లీమీటర్లు, 1972లో 83.2 మిల్లీమీటర్లు.. ప్రస్తుతం ఆగస్టులో 74.4 మిల్లీమీటర్ల వర్షాపాతం రికార్డయ్యింది. సాధారణంగా తెలంగాణలో 120 రోజులు వర్షాకాలం ఉంటుందని, 60-70 రోజులు మంచి వర్షాలు కురుస్తాయని.. మిగతా రోజుల్లో అడపదడపా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో జూన్‌లో లోటు ఏర్పడిందని, జులైలో మంచి వర్షాలు కురిసినా.. ఆగస్టులో వరుణుడు ముఖం చేశాడు. లోటు వర్షపాతానికి ఎల్ నినో ప్రధాన కారణమని నిపుణులు వాతావరణశాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# గ్యాస్ బండ ధర తగ్గిస్తోన్న కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

2023-24లో రూ.7680 కోట్ల భారం పడుతుందని అంచనా.

'రాఖీ పండుగ, ఓనమ్ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను రూ.200 తగ్గించింది. ఉజ్వల యోజన కింద రూ.200 అదనపు సబ్సిడీని పొడగించింది. దాంతో 73 లక్షల మహిళలకు ప్రయోజనం కలగనుంది' అని కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖా మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. అంతేకాకుండా ఉజ్వల స్కీమ్ కింద మరో 75 లక్షల కొత్త కనెక్షన్లు ఇస్తామని వెల్లడించారు.

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించడానికి కొన్ని కారణాలు కనిపిస్తున్నాయి. త్వరలోనే ఐదు రాష్ట్రాల ఎన్నికల కోలాహలం మొదలవుతుంది. ఆరు నెలల్లో లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు వస్తుంది. ద్రవ్యోల్బణం పెరుగుదల, ఆహార పదార్థాల ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారు. దాంతో మోదీ సర్కార్ ఈ చర్యలు తీసుకుంది. అంతేకాకుండా కొన్ని నెలలుగా రష్యా నుంచి అతి తక్కవ ధరకే క్రూడాయిల్ కొనుగోలు చేస్తోంది.

మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 90-100 డాలర్లు పలుకుతుండగా రష్యా నుంచి 70 డాలర్లకే దిగుమతి చేసుకుంటోంది. దీంతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు లాభాలు ఆర్జించాయి. ఇప్పుడు ఆ ప్రయోజనాన్ని ప్రజలకు బదిలీ చేస్తున్నారు. 2023 జులైలో రిటైల్ ఇన్‌ఫ్లేషన్ 7.44 శాతంగా నమోదైంది. 15 నెలల గరిష్ఠానికి చేరుకుంది. మరింత పెరిగితే ఇబ్బందులు తప్పవు. అందుకే గ్యాస్ సిలిండర్ ధర తగ్గిస్తే కొంత ఉపశమనం లభిస్తుందని మోదీ సర్కారు భావించింది.

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేబినెట్ కమిటీ అతి త్వరలోనే గ్యాస్ సిలిండర్ల ధరను తగ్గించబోతోందని నేటి మధ్యాహ్నం వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ప్రధాన మంత్రి ఉజ్వల యోజనా (ఖఓజజ) పథకం లబ్ధిదారులకు ఈ ప్రయోజనం దక్కనుంది. ఇప్పటికే కేంద్రం ఎల్పీజీ సిలిండర్లపై రూ.200 రాయితీ ఇస్తోంది. ఇప్పుడు అదనంగా రూ.200 వరకు తగ్గించనుంది. దాంతో పీఎంయూవై లబ్ధిదారులు ఒక్కో సిలిండర్‌పై రూ.400 వరకు ఆదా చేసుకోవచ్చు.

ఉజ్వలా పథకం లబ్ధిదారులకు ఏడాది పాటు రూ.200 వరకు సబ్సిడీ పొడగిస్తూ 2023 మార్చిలోనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. గ్రామీణ ప్రజలు, పేదలకు ఎల్పీజీ అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో కేంద్రం 2016లో ప్రధాన మంత్రి ఉజ్వలా యోజనను ఆరంభించింది. ఎలాంటి డిపాజిట్లు లేకుండా వీరికి ఉచిత గ్యాస్ కనెక్షన్ ఇచ్చింది. అర్హులైన లబ్ధిదారులకు ఒక్కో సిలిండర్‌పై సబ్సిడీని బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేస్తోంది.

ఆగస్టు నెలారంభంలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సవరించాయి. 19 కిలోల ఎల్పీజీ బండపై రూ.99.75 తగ్గించింది. దాంతో దిల్లీలో వాణిజ్య సిలిండర్ ధర రూ.1680కి చేరుకుంది. అయితే 14.2 కిలోల గృహ అవసరాల సిలిండర్ ధరను మార్చి ఒకటి నుంచి తగ్గించలేదు. ప్రస్తుతం సబ్సిడీయేతర సిలిండర్ రూ.1100 నుంచి రూ.1120 వరకు ఉంటోంది. బహుశా సెప్టెంబర్ ఒకటి నుంచి డొమస్టిక్ సిలిండర్ల ధరలు తగ్గుతాయని అంచనా.

# జిల్లాలపై.. బీఆర్ఎస్ నిఘా

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం. తుమ్మల పార్టీ వీడితే ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాల్సి ఉంది. ఖమ్మం జిల్లాలో బలమైన నేతలు ఆయా పార్టీలో చేరే సమయంలో భారీ బహిరంగ సభలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పొంగులేటి చేరిన సమయంలో కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభ నిర్వహించింది. మరో వైపు తెలంగాణపై బిజెపి కూడా పూర్తి ఫోకస్ పెట్టింది. మరో మూడు నెలల్లో ఎన్నికలు రాబోతుండడం తో బిజెపి అధిష్టానం దూకుడు పెంచింది. కేసీఆర్ అహంకారం దిగిపోవాలంటే ఈ సారి బీఆర్ఎస్ మళ్లీ అధికారంలో రావొద్దని తెలంగాణ బిజెపి చేరికల కమిటీ చైర్మన్ ఈటెల రాజేందర్ పిలుపునిస్తున్నారు.

కేసీఆర్ పోటీ చేయబోయే గజ్వేల్ నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్ దాదాపు ఖాయమనే వార్తలు వస్తున్నాయి. ఈ ఎన్నికలలో బిఆర్ఎస్ కు జిల్లాలోని అన్నిస్థానాలను గల్లంతు చేయాలని ప్రతి పక్షాలు చూస్తున్నాయి. తెలంగాణ ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లిన ఖమ్మం జిల్లాలో జరుగుతున్న రాజకీయాలు చూస్తుంటే కేసీఆర్ తల బొప్పికట్టేట్టు ఉంది. నో డౌట్.

## బీఆర్ఎస్ జాబితాలో ...

# మార్పులు చేర్పులు తప్పవా !?

(మొదటి పేజీ తరువాయి)

కొత్త వ్యక్తులు, సిట్టింగ్‌లనే మళ్లీ అభ్యర్థులుగా ప్రకటిస్తారా..? మొత్తం 24 అసెంబ్లీ నియోజకవర్గాలపై కేసీఆర్ ప్రత్యేకంగా నిఘా పెట్టారా..? అంటే తాజాగా అందుతున్న సమాచారం మేరకు ఇవన్నీ అక్షరాలా నిజమేనని తేలింది. ఇంతకీ ప్రచారం జరుగుతున్న ఆ నియోజకవర్గాలు ఏంటి..? మంత్రి కేటీఆర్ విదేశాల నుంచి వచ్చిన తర్వాత కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందా..?

**అసలేం జరుగుతోంది..?**

ప్రతిపక్షాలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఊహకందని రీతిలో ఒకేసారి 115 మంది అభ్యర్థులను ప్రకటించి కేసీఆర్ వ్యూహాత్మకంగా అడుగులేసిన సంగతి తెలిసిందే. అయితే ఆ ప్రకటన అలా వచ్చిందో లేదో పలు నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లు, టికెట్ ఆశించిన ఆశావాహులు, కీలక.. ముఖ్యనేతలు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహానికి లోనవుతున్నారు. వీరిలో కొందరు సిట్టింగ్‌లు గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పేయడానికి కూడా రంగం సిద్ధం చేసుకున్నారు. మరికొందరు సిట్టింగులు, ఆశావాహులు అభిమానులు, కార్యకర్తలు, అనుచరులతో సమావేశాల తర్వాత భవిష్యత్ కార్యాచరణ ప్రకటించబోతున్నారు. 'బాబోయ్.. ఈయనకు ఎందుకు టికెట్ ఇచ్చారు..' అని అధిష్టానాన్నే ప్రశ్నిస్తున్నారు. ఇక ఎక్కడ చూసినా అధిష్టానంపై సొంత పార్టీ నేతలు తిరుగుబాటు చేస్తుండటం, రహస్య సమావేశాలు ఏర్పాటు చేస్తుండటం, కాంగ్రెస్, బీజేపీ వైపు పలువురు అడుగులేస్తుండటం లాంటివి జరుగుతున్నాయి. అయితే విశ్వసనీయవర్గాలు, బీఆర్ఎస్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు కేసీఆర్ ప్రకటించిన జాబితాలోని సుమారు 20 మంది అభ్యర్థులకు (20 బీఫామ్ కష్టమేనని తెలిసింది. ఎందుకంటే ఇప్పటికిప్పుడు టికెట్లు ఇవ్వమని చెప్పేస్తే పక్క చూపులు చూస్తారని.. తద్వారా క్యాడర్ దెబ్బతింటుందనే ఉద్దేశంతో ప్రస్తుతానికి ప్రకటించినప్పటికీ తర్వాత మార్పులు, చేర్పులు చేయాలనే కేసీఆర్ ఇలా చేశారట. చివరి నిమిషంలో టికెట్ ఇవ్వమని చెబితే.. అప్పటికప్పుడు తిరుగుబాటు చేసి వేరే పార్టీలో చేరినా పెద్దగా మైలేజీ ఉండదని, కొత్త గుర్తుపై కష్టమేనని బీఆర్ఎస్ భావిస్తోందట. ఇప్పటికిప్పుడు టికెట్ ఇవ్వమని పెద్ద సునామీని క్రియేట్ చేసుకోవడం కంటే.. ఎన్నికలు సమీపించాక ఆచితూచి నిర్ణయం ప్రకటిస్తే సరిపోతుందని బీఆర్ఎస్ అధిష్టానం ఫిక్స్ అయ్యిందట.

**కేటీఆర్ వచ్చాకే..!**

'ఈ జాబితాలోని 115 మంది అభ్యర్థులు ఫైనల్ కాదు.. మున్ముందు మార్పులు, చేర్పులు కచ్చితంగా ఉంటాయి' అని అభ్యర్థుల జాబితా ప్రకటించిన రోజే కేసీఆర్ క్లియర్ కట్‌గా చెప్పేసిన విషయం తెలిసిందే. దీంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరినట్లయ్యింది. వాస్తవానికి కేసీఆర్ ప్రకటన చేసినప్పట్నుంచే టికెట్ దక్కించుకున్నా కొందరు ఎమ్మెల్యేల్లో గుబులు మొదలైంది. అయితే తాజా వచ్చిన ఈ సమాచారం ఆ ఎమ్మెల్యేల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయట. ఎప్పుడు ఎలాంటి ప్రకటన వస్తుందో.. చివరికి ఏం జరుగుతుందో..? అసలు పార్టీ తరఫున పోటీచేస్తానో లేదో..? అని టికెట్ దక్కించుకున్న నేతలు ఆలోచనలో పడ్డారట. కొందరైతే కేసీఆర్ ఇదేగానీ చేస్తే ప్రత్యామ్నాయంగా ఏం చేయాలనేదానిపై కాంగ్రెస్ పెద్దలతో టచ్‌లోకి కూడా వెళ్లినట్లుగా వార్తలు గుప్పుమంటున్నాయి. అయితే.. విదేశాల్లో ఉన్న మంత్రి కేటీఆర్ త్వరలోనే హైదరాబాద్ రానున్నారు. వాస్తవానికి చాలా మంది మార్చాలని కేటీఆర్ పట్టుబట్టినప్పటికీ కేసీఆర్ మాత్రం అవన్నీ పట్టించుకోలేదట. దీంతో ఆయన వచ్చాకే మార్పులు, చేర్పులు ఉంటాయని వార్తలు గుప్పుమంటున్నాయి. మరోవైపు.. తన మిత్రుల్లో కొందరు.. కావాల్సిన మరికొందరికి కేసీఆర్ టికెట్లు ఇవ్వలేదట. వారిలో కొందరి కేటీఆర్ వచ్చాక టికెట్ ప్రకటించే ఛాన్స్ ఉంది.

**ఈ స్థానాల్లోనే మార్పు..!**

ఎక్కడెక్కడ అయితే అసంతృప్తి, ఆందోళనలు ఎక్కువయ్యాయో ఆయా నియోజకవర్గాల్లో ఇప్పటికే కేసీఆర్ రహస్య సర్వే కూడా చేయించి నట్లుగా భోగట్టా. ఆ సర్వేలు సిట్టింగ్‌లను, టికెట్ దక్కించుకున్న కొత్త వ్యక్తులను కలవరపాటుకు గురిచేస్తున్నాయట. కోదాడ, ఇల్లందు, నాగార్జున సాగర్, ఉప్పల్, అసిఫాబాద్, మహబూబాబాద్, బెల్లంపల్లి, మంథని, కొత్తగూడెం, వరంగల్ ఈస్ట్, మల్కాజిగిరి, కల్వకుర్తి, పెద్దపల్లి, రామగుండం, కంటోన్మెంట్, మానకొండూర్‌తో ఉమ్మడి ఖమ్మంలోని ఇంకొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులపై తీవ్ర వ్యతిరేకత వస్తోందట. సర్వే చేయించినప్పటికీ ఫలితం లేకపోయిందట. దీంతో ఈ స్థానాల్లో టికెట్లు దక్కించుకున్న నేతలు టెన్షన్ పడుతున్నారట. అయితే ఇప్పటికే ఆయా స్థానాల్లో ఎవరిని నియమిస్తే బాగుంటుందని కేటీఆర్ టీమ్ రంగం లోకి ప్రత్యామ్నాయ మార్గాలను చూస్తోందట. దీంతో టికెట్లు ఆశించిన, సిట్టింగుల్లో ఆశలు చిగురిస్తున్నాయట. ఫైనల్‌గా ఏం జరుగుతుందో.. ఎన్నెన్ని మార్పులు, చేర్పులు జరుగుతాయో..? అసలు ఇందులో నిజానిజాలెంతో తెలియాలంటే కేటీఆర్ వచ్చినంత వరకూ వేచి చూడాల్సిందే మరి.

## ప్రపంచంలోనే అత్యంత అధిక

# కాలుష్యం నగరంగా ఢిల్లీ నమోదు

(మొదటి పేజీ తరువాయి)

సూచించిన సగటు ఆరోగ్య స్థాయి కన్నా ఎక్కువ స్థాయిలో కాలుష్యం ఉన్నట్లు తెలిపారు.దేశంలో 67 శాతం మంది తీవ్ర కాలుష్య పరిస్థితుల్లోనే రోజులు గడుపుతున్నట్లు తెలిపారు. పంజాబ్‌లోని పఠాన్‌కోట్ ప్రాంతంలో పార్టికులేట్ పొల్యూషన్ డబ్ల్యూహెచ్‌వో సూచించిన స్థాయి కన్నా ఏడు రెట్లు ఎక్కువగా ఉంది. ఒకవేళ కాలుష్య తీవ్రత ఇదే స్థాయిలో కొనసాగితే అప్పుడు జీవితకాలం 3.1 సంవత్సరాలు తగ్గనున్నదని రిపోర్టు తెలిపింది.ఢిల్లీ ప్రాంతంలో మిగితా దేశంతో పోలిస్తే సాంద్రత మూడు రెట్లు ఎక్కువగా ఉందని రిపోర్టులో తెలిపారు. వాహనాలు, నిర్మాణాలు, వ్యవసాయం వల్ల కూడా కాలుష్యం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. కాలుష్య వాయువులను పీల్చడం వల్ల బంగ్లాదేశ్, ఇండియా, పాకిస్థాన్, చైనా, నైజీరియా, ఇండోనేషియా దేశాల ప్రజలు ఆరేళ్ల వరకు తమ జీవితకాలాన్ని కోల్పోనున్నట్లు అంచనా వేస్తున్నారు.

## వినాయక చవితికి

# భాగ్యనగరం ముస్తాబు

(మొదటి పేజీ తరువాయి)

యాదవ్ అధికారులతో సమావేశం అయ్యారు. ప్రతీ ఏటా గణేశ్ ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని మంత్రి తెలిపారు. హైదరాబాద్ తో పాటు చుట్టుపక్కల 32,500 వరకు వినాయక మండపాలు ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. వచ్చే నెల 19వ తేదీన వినాయక చవితి నవరాత్రులు ప్రారంభం అవుతాయని, 28న నిమజ్జనం జరిగేంత వరకు బందోబస్తు ఉంటుందన్నారు. బందోబస్తుకు తెలంగాణ పోలీసులతో పాటు అవసరమైతే ఇతర రాష్ట్రాల పోలీసుల సాయం తీసుకుంటామని మంత్రి తలసాని వెల్లడించారు.గత ఏడాది లాగే ఈసారి కూడా గణేష్ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. వినాయక వ్రత కథ పుస్తకంతో పూజా సామాగ్రిని భక్తులకు ఇస్తామన్నారు. గణేష్ మండపాలకు పోలీసు పర్మిషన్ తప్పనిసరి కాదన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇస్తే చాలన్నారు. గణేష్ ఉత్సవాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు పెట్టొద్దని సూచించారు. సుప్రీంకోర్టు ఫ్లెక్సీలను నిషేధించిందని గుర్తుచేశారు. గణేష్ ఉత్సవాల్లో ఈసారి కూడా రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను పెట్టవద్దన్నారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పండుగ సజావుగా జరిగేందుకు కృషి చేయాలని కోరారు. గత తొమ్మిదేళ్లలో అన్ని మతాల పండుగలను బీఆర్ఎస్ ప్రభుత్వం ఘనంగా నిర్వహించిందన్నారు. గణేష్ నిమజ్జనం కోసం తాత్కాలిక చెరువులను ఏర్పాటు చేస్తామన్నారు. వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్ నబి ఒకేరోజు వస్తున్నాయన్న మంత్రి తలసాని, ఆరోజు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు.అయితే వినాయక చవితి పండగను సెప్టెంబర్ 18న నిర్వహించుకోవాలని తెలంగాణ విద్వత్సభ సూచిస్తోంది. సెప్టెంబర్ 18 నుంచే నవరాత్రులను ప్రారంభించాలని విద్వత్సభ తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం, అన్ని పీఠాలకు శాస్త్రబద్ధంగా నిర్ణయించిన పండగల జాబితాను విద్వత్సభ అందించింది. వినాయక చవితి పండగను సెప్టెంబర్ 18న ? లేదా సెప్టెంబర్ 19న నిర్వహించాలా? అనే అంశంపై ప్రజల్లో సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రంలో 100 మంది సిద్ధాంతుల సమక్షంలో జులై 22, 23న షష్ఠమ వార్షిక విద్వత్సమ్మేళనంలో చర్చించి వినాయక చవితి పండగ తేదీపై ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. అయితే వినాయక చవితి నిర్వహణ తేదీపై ప్రభుత్వం ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు.

# దేశ నిర్మాణంలో భాగం అవుతా..!

(మొదటి పేజీ తరువాయి)

**గుర్తింపు తెచ్చిన మోదీ**

ప్రధానమంత్రి నరేంద్రమోదీపై చంద్రబాబు ప్రశంసలు కురిపించారు. మోడీ భారత్ కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చారున్నారు. వాజ్ పెయి,మన్మోహన్ సింగ్ అంతగా అంతర్జాతీయ పర్యటనలు చేయలేదని గుర్తు చేసారు. భారత దేశం టెక్నాలజీలో చాలా అడ్వాన్స్ స్టేజ్ లో ఉంది. డీప్ డ్రైవ్ టెక్నాలజీస్ వినియోగంలోకి వస్తున్నాయి. వ్యవసాయం, హెల్త్ రంగాల్లో ఈ టెక్నాలజీ విప్లవాత్మక మార్పులు చూడొచ్చన్నారు. భారత్ లో అనంతమైన సౌర శక్తి ఉంది. సౌర, పవన విద్యుత్.. సహా భారత్ కి డెమోగ్రఫిక్ సానుకూలత చాలా ఎక్కువ ఉన్నాయన్నారు. భారత్ కి యువ శక్తి ఉంది. దేశం అభివృద్ధి చెందిన తర్వాత ప్రజలు పిల్లలు వద్దని అనుకుంటారు. అప్పుడు యువ శక్తి తగ్గుతుంది. అందుకే, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని జనాభా పెరగాలి అని కోరుకుంటున్నా. పిల్లల్ని కనాలి అని ప్రోత్సహిస్తున్నామన్నారు. పాపులేషన్ మేనేజ్మెంట్ అనేది ఉండాలన్నారు.

**భారతీయులను చూసి అమెరికా ప్రజలకు అసూయ**

ప్రతి కుటుంబాన్ని మానిటర్ చేసేలా సాంకేతికత వినియోగించుకోవాల్సి ఉందన్నారు. ప్రతి పేద కుటుంబాన్ని పేదరికం నుంచి బయటపడేలా చూడొచ్చన్నారు. అదాని, అంబానీ, టాటా అంటూ కొందరికే ఆస్తులు సృష్టించడం కంటే ప్రతి కుటుంబం అస్తి సృష్టించే అవకాశం కల్పించాల్సి ఉందన్నారు. ప్రతి భారతీయులు గ్లోబల్ ఆలోచనలు చేస్తారన్నారు. ఇక్కడ కూర్చుని గ్లోబల్ అవసరాలు తీర్చే ఉద్యోగం చేయవచ్చని.. ఇండియన్ అనేవాడు భూమి మీద ఎక్కడైనా సర్వైవ్ కాగలడు. భారతీయులకు ఉన్న గొప్ప లక్షణం ఎక్కడైనా సర్వైవ్ అవ్వడమేనన్నారు. జపనీయులు గుంపుగా తప్ప విడిగా బయటకు రారు. భారతీయులు ఏ వాతావరణం అయినా తట్టుకుంటారన్నారు. ఇండియన్ కల్చర్ బెస్ట్ కల్చర్. భారతీయులను చూసి అమెరికా ప్రజలు అసూయ పడుతున్నారన్నారు.

**రూ. 500 ఆపై నోట్ల రద్దు చేయాలని సూచించాను !**

రూ. 500, ఆపై కరెన్సీ నోట్లను రద్దు చేయాలని సూచించానని చంద్రబాబు గుర్తు చేశారు. అలా చేస్తే ఎన్నికల్లో నగదు పంపిణీ ఉండదు. మంచి ప్రభుత్వాలు అధికారంలోకి వస్తాయన్నారు. రాజకీయ అనుభవం ఉన్నవాళ్లెవరూ మోడీని విమర్శించడం లేదని చంద్రబాబు గుర్తు చేశారు. మోడీ వయసు గురించి మాట్లాడే దమ్ము వైసీపీ వాళ్లకు ఉందా? అని ప్రశ్నించారు. హైదరాబాద్ అభివృద్ధి పై నాకు ఉన్నంత సంతృప్తి ఎవరికి ఉంటుందని ప్రశ్నించారు. ఏపీ, తమిళనాడు లో కాంగ్రెస్ పుంజుకునే అవకాశం లేదని.. దక్షిణాది లో కాంగ్రెస్ ఉంది తెలంగాణ, కర్ణాటకలోనేనన్నారు.

## సంపాదకీయం

### రజకులకు రాజ్యాధికారంలో మొండిచేయి



కోట దామోదర్
మొబైల్: 9391480475

తెలంగాణ తొలి దశ, మలి దశ ఉద్యమంలో ఇతర కుల వృత్తుల వారితో పాటు రజకులు కూడా తమ సంపూర్ణ సంఘీభావాన్ని ప్రదర్శించి రాష్ట్ర సాధనలో ప్రధాన భూమిక పోషించారు. సభ్య సమాజానికి రజకులు చేసిన సేవలు మరువలేనివి. దేశ సేవకులైన రజకులను బానిసలుగా మార్చిన పాపం అగ్రకుల నాయకులదే. ఆటు రాజ్యాధికారంలోను, మిగతా అన్నింటిలో సరైన గుర్తింపు ఇవ్వకుండా వారిని కేవలం ఓటు బ్యాంకు గానే వినియోగించుకున్నారు తప్ప వారికి ఎలాంటి ప్రయోజనాత్మకమైన పథకాలు గానీ ప్రాధాన్యత గానీ ఇవ్వడంలేదు. ప్రతి రజకుడి ఇంటికి ఉచిత కరెంటు ఇస్తామని చెప్పి యేండ్లు గడిచిన ఇప్పటికి పూర్తి స్థాయిలో అమలుకాలేదని రజక సంఘాలు వాపోతున్నాయి. ఎంతో కష్టపడి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో సరైన ప్రాధాన్యత ఇవ్వడంలేదని తమ హక్కుల పరిరక్షణ కొరకు రజక సంఘాలు కూడా రాజ్యాధికారం కోసం రాజకీయ యుద్ధ భేరీ సమావేశాలు నిర్వహించాలని కోరుకుంటున్నాయి. 2023 ఎలక్షన్ లో రాజ్యాధికార దిశ గా ముందుకు అడుగులువేయాలని భావిస్తున్నారు..

**రాజ్యాధికారమే లక్ష్యంగా కుమ్మరివృత్తి సంఘాలు:**

పర్యావరణానికి ముప్పు కలిగించడంతో పాటు సమస్త జీవరాసులపై దుష్ప్రభావం చూపే ప్లాస్టిక్ వస్తువులు విరివిగా మార్కెట్లను ముంచెత్తుతుండడంతో కుమ్మరులు తయారు చేసే మట్టి పాత్రలకు ఆదరణ కరువైంది. కుమ్మరులు ఒకప్పుడు ఊరి చెరువులోనుండి తామేస్వయంగా మట్టితెచ్చుకుని తక్కువ ఖర్చుతో కుండను తయారు చేసినప్పటికీ అప్పట్లో బాగా గిరాకీ ఉండడంతో లాభసాటిగా ఉండేది. కానీ ఈరోజుల్లో రోజంతా కష్టపడి కుండలు చేస్తే కనీసం రోజుకు 200 రూపాయలు కూడా గిట్టుబాటు కావడం లేదు. అయినాసరే వృత్తిపై మమకారంతో అమ్ముకుందామంటే గిరాకీ ఉండడం లేదు. బతుకుదెరువు కోసం ఇతర వృత్తులపై ఆధారపడి జీవనం సాగించాల్సిన పరిస్థితులు నెలకొనడంతో వృత్తినే నమ్ముకున్న కుమ్మరి జీవితం నేడు అగమ్యగోచరంగా తయారైంది. ఎంతో కళానైపుణ్యంతో కూడుకున్న కుమ్మరి వృత్తి ఆదరణ కరువై ఇలా అంతరించిపోవడం అత్యంత బాధాకరమైన విషయం. ఇవ్వాళ కుమ్మరి వృత్తి జీవితం కుదేలయింది. స్టీల్, ప్లాస్టిక్, జర్మన్ సిల్వర్ వినియోగం విపరీతం గా పెరిగిపోవడంతో ఖాళీ కడుపులతో వెలవెల బోతోంది. కాలచక్రంతో పోటీపడలేక మట్టి కుండ కనుమరుగైపోతోంది ప్రభుత్వాల చేయూత లేక చేతి వృత్తులు కనుమరుగవుతుంటే కనీసం వారికి సరైన ఉపాధి హామీ కల్పించలేని పరిస్థితి. కుమ్మరి వృత్తికి ఎలాంటి పథకాలు లేకపోవడం శోచనీయం. కుమ్మరి వృత్తిదారులు మాకు అన్నిటిలోను అన్యాయమే జరిగిదంటూ మా హక్కులు మాకు కావాలంటూ రాజ్యాధికార దిశగా అడుగులువేస్తున్నారు. కుమ్మరి సంఘాలు ఏక తాటిపై నడవాలని భావిస్తున్నాయి.

**రాజ్యాధికారమే లక్ష్యంగా గౌడ సంఘాలు:**

నేడు మద్యం అమ్మకాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో లిక్కర్,బీర్, బ్రాంది, విస్కీ, రమ్ము, శీతల పానియాలు (థమ్స్ అప్, కోకోకొలా, స్ప్రైట్, మాజా) అనేకం రావటం వలన కల్లు తాగేవారి సంఖ్య గణనీయంగా తగ్గింది. అందు ఫలితంగా దీనిపై ఆధారపడ్డ లక్షలాదిమంది గీతకార్మికుల బ్రతుకులు ప్రశ్నార్థకంగామారుతున్నాయి. అందుకు కారణం ప్రభుత్వమే. ఎందుకంటే ప్రైవేటు సంస్థలు శీతల పానీయాలమీద పత్రికలు,టీవీ లలో గుప్పించి ఆకట్టుకుంటుంటే ప్రభుత్వం మాత్రం కల్లు ఆరోగ్యానికి ఏ విధమైన మేలుచేస్తుందో ప్రజలకు అడ్వర్ టైజ్‌మెంటుల రూపంలో చెప్పకపోవడం ఇందుకు ముఖ్యకారణం అనే చెప్పాలి. నేటియువత మద్యానికిఇచ్చిన ప్రాధాన్యత కల్లుకు ఇవ్వక పోగా దానిని చులకన చేసి చూడటం అత్యంత బాధాకరమైన విషయం. అంతేగాక వ్యవసాయం వంటి ఇతర రంగాల్లో అభివృద్ధి సాదించినప్పటికీ మారుతున్న కాలానికి అనుగుణంగా కల్లుగీత వృత్తిలో ఎలాంటి ఆధునిక పద్ధతులను, విధానాలను తీసుకురాకపోవడంతో ఆ వృత్తి దెబ్బతింటోంది. ప్రభుత్వం పట్టించుకోనప్పటికీ గౌడన్న తన సంప్రదాయ వృత్తిని బ్రతికించుకోవడానికి ఎంతో ప్రయాసపడుతున్నాడు. కల్లుగీత కార్మికుల పరిష్కారానికి నోచుకోని సమస్యలు ఎన్నో ఉన్నాయి. తెలంగాణ ఏర్పాటు తర్వాత గౌడాన్న చెట్టుపైనుండి పడి చనిపోతే వారి కుటుంబానికి 5 లక్షల నష్ట పరిహారం అందచేయటం సంతోషకరమైన విషయమే అయినప్పటికీ మేము బ్రతుకున్నపుడే మంచి మార్గాన్ని చూపే పథకాలుంటే బాగుంటుంది అనే ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 2023 ఎలక్షన్ లో రాజ్యాధికార దిశ గా ముందుకు అడుగులువేయాలని భావిస్తున్నారు.. తెలంగాణ ఉద్యమంలో పెద్ద ఎత్తున పాల్గొన్న బీసీ కులాలు తమ అస్తిత్వాన్ని పక్కనపెట్టి ఎలాంటి స్వార్థం లేకుండా చిత్తశుద్ధితో ఉద్యమంలో పాల్గొన్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను పట్టించుకోకుండా బీసీ వ్యతిరేక ధోరణి అవలంబిస్తూ వచ్చింది. బి సి లకు టిక్కెట్ల పంపకం లో కూడా పూర్తి వ్యతిరేకత చూపింది.

**గుర్తింపు నోచుకోని నాయి బ్రాహ్మణుల వృత్తి:**

2019 లో కరోనా మహమ్మారి ప్రభావంతో వృత్తినే నమ్ముకున్న నాయిల నాయీ బ్రాహ్మణుల జీవితం ఒక్కసారిగా దారితప్పినట్లైంది. హెయిర్ కటింగ్ సెలూన్ లకు గిరాకీ లు లేక తీవ్రమైన ఆర్థిక సంక్షోభానికి గురై షాపులకు కిరాయిలు అద్దె మరియు కరెంటు బిల్లులు కూడా చెల్లించలేని పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఇదిలా ఉండగా కార్పొరేట్, ఆన్ లైన్ లో సేవలపేరుతో "అర్బన్ క్లాప్" లాంటి పలు సంస్థలు ఉనికి లోకి రావడంతో ఈ వృత్తే జీవనం సాగించే సాధారణ నాయీ బ్రాహ్మణులు మరింత ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే దాదాపు అన్ని కులవృత్తులు కనుమరుగైపోయినా.. వీరు మాత్రం అచంచలమైన ధైర్యంతో వృత్తిని కాపాడుకుంటూనే ఉన్నారు. ఏదేమైనా కులవృత్తులనే నమ్ముకుని అరకొర సంపాదనతో సాధారణ జీవితాలను నెట్టుకొచ్చే బడుగు జీవులతోబడా కార్పోరేట్ సంస్థలు పోటీ పడి వారి నోటి ముందు కూడును లాక్కోవడం అత్యంత శోచనీయం. వంశపారంపర్య వృత్తిపై మమకారం చంపుకోలేక, కుటుంబాన్ని పోషించలేక తీవ్ర మనోవేదనకు గురవుతుండగా కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఇతర కుల వృత్తుల వారితో పాటు నాయీ బ్రాహ్మణులు కూడా తమ సంపూర్ణ సంఘీభావాన్ని తెలిపి రాష్ట్రాన్ని "బంగారు తెలంగాణ" గా మారుస్తానన్న ముఖ్యమంత్రి వాగ్దానం ఎప్పుడెప్పుడు నెరవేరుతుందా అని వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. సభ్య సమాజానికి నాయీ బ్రాహ్మణులు చేస్తున్న సేవలను ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వారి ఇక్కట్లను రూపుమాపేందుకు పటిష్టమైన ప్రణాళికను రూపొందించి ఆదుకోవాలని నాయీ బ్రాహ్మణులు ముక్తకంఠంతో కోరుకుంటున్నారు.

# తెలంగాణ కుటుంబ ఇంటి పెద్ద కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

కండువా కప్పి పార్టీలోకి మంత్రి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మంత్రి వేముల మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణ..తలెత్తుకుని నిలబడాలనేదే కేసిఆర్ తపన అని మంత్రి అన్నారు. తెలంగాణ అంతా ఒకే కుటుంబమైతే ఆ ఇంటి పెద్ద కేసిఆర్ అని,కుటుంబం ఎప్పుడూ బాగుండాలని ఇంటి పెద్ద ఆరాటపడుతడాని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజలు దేశంలోనే అత్యంత ఉన్నతంగా బ్రతకాలని కేసిఆర్ తపనపడుతారని గుర్తు చేశారు. హరితాహారం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో 9శాతం గ్రీనరి పెరిగిందని, ఇంత పచ్చదనం పెంపు ప్రపంచంలోనే ఇదెక్కడ సాధ్యం కాలేదన్నారు. సమాజ హితం,భవిష్యత్ తరాల కోసం మాత్రమే చేపట్టిన కార్యక్రమమని,ఓట్ల కోసమో రాజకీయం కోసమో చేసింది కాదని వివరించారు. ఇంటింటికీ సురక్షిత నల్లా నీరు అందుతుందంటే దాని వెనుక కేసిఆర్ నిద్ర లేని రాత్రులు ఎన్నో ఉన్నాయని, కేవలం ఆయన అకుంఠిత దీక్ష వల్లే 3 ఏళ్లలో అది సాధ్యం అయ్యిందని అన్నారు. ప్రతీ పథకం మానవీయ కోణంలో ఆలోచించి ప్రవేశపెట్టిందే అని అన్నారు. ఒకప్పుడు నీటికి,కరెంట్ కు కటకట ఉండేదని,ఎరువుల కోసం చెప్పులు లైన్లు పెట్టిన రోజులు ఉన్నాయని గుర్తు చేశారు. నేడు కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులతో,ఎస్సారెస్పీ పునరుజ్జీవపథకం రివర్స్ పంపింగ్ ద్వారా లిఫ్ట్ ల నుండి వాగులు,చెరువులు నింపుకోవడం,చెక్ డ్యాంలు నిర్మించుకుని నీటిని ఒడిసిపట్టడంతో యాసంగిలో కూడా భూమి బీడు లేకుండా పంటలు సమృద్ధిగా పండుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ హయాంలో ఎరువుల కోసం చెప్పులు లైన్లో పెట్టేదని,పోలీస్ స్టేషన్లో పెట్టి ఎరువులు అమ్మారని పాత రోజులు గుర్తు చేశారు. అట్లాంటి బాధలు అన్నీ ఇప్పుడు కేసిఆర్ దూరం చేశారని తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కేసిఆర్ లాగా మరెవరూ కనీసం ఆలోచన కూడా చేయలేరని మంత్రి స్పష్టం చేశారు. ఆనతి కాలంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని...యావత్ దేశానికే ఆదర్శంగా నిలిపారని,నేడు ఏ రంగం చూసుకున్నా తెలంగాణ నంబర్ వన్ అయ్యిందన్నారు.

రైతులకు 3గంటల కరెంట్ చాలు అంటున్న చేతి గుర్తోడు(కాంగ్రెస్)...వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెడతమంటున్న పువ్వు గుర్తోడు(బీజేపీ)మనకు అవసరమా అని అన్నారు. పక్కన కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 4వేల పెన్షన్ ఎందుకు ఇస్తలేదని,తెలంగాణలో ఎట్లా ఇస్తారని ప్రశ్నించారు.

ఓట్లు అయితే డబ్బాల పడనీ తర్వాత చూద్దామనే నీచ వైఖరి కాంగ్రెస్ దని మండిపడ్డారు. వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయనోల్లు.. ఇప్పుడు చందమామ తెచ్చి ఒళ్ళో పెడతాం..సూర్యున్ని కిందికి దించుతాం అంటే ప్రజలు నమ్ముతారా అని ఎద్దేవా చేసారు. ఇక బీజేపీ..అబద్దాలు,పనిచేసే వారి మీద బట్టకాల్చి మీద వేసుడే తన ప్రధాన ప్రచారంగా మార్చుకున్నదని దుయ్యబట్టారు. పెట్రోల్,డీజిల్, గ్యాస్,ఉప్పు,పప్పు,కారం,నూనె నిత్యావసర ధరలు పెంచిన బీజేపీ మోడీ ప్రభుత్వం వల్ల గోసపడని కుటుంబమే లేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల బాగు కోరేది కేసిఆర్ అయితే...తెలంగాణ ప్రజల ఓట్లు కోరేది బీజేపీ,కాంగ్రెస్ పార్టీలు అని,మోసపు మాటలతో,అబద్ధపు హామీలతో ఎన్నికల వేళ వస్తున్న కాంగ్రెస్,బీజేపీ ల పట్ల రైతులు,ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులన్న, పేదలన్న గిట్టని కాంగ్రెస్,బీజేపీ పార్టీలకు బుద్ది చెప్పాలని పిలుపునిచ్చారు. తెలంగాణను కంటికి రెప్పలా కాపాడుకునే కేసిఆర్ కు అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలని,కేసీఆర్ నాయకత్వమే తెలంగాణ కు శ్రీరామ రక్ష అని మంత్రి వేముల పునరుద్ఘాటించారు.

# మైనంపల్లికి దారి దొరికినట్లేనా..!

(మొదటి పేజీ తరువాయి)

అవుతున్నట్లుగా తెలుస్తోంది.

మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కుమారుడు మైనంపల్లి రోహిత్‌కు టికెట్ నిరాకరించడంతో ఆర్థిక మంత్రి టి.హరీశ్‌రావుపై రాజకీయంగా దుమారం రేపిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు స్థానంలో సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నట్లు బీఆర్ఎస్ వర్గాల్లో ఊహా గానాలు సాగుతున్నాయి. హనుమంతరావు స్థానంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పేరును బీఆర్ఎస్ బాస్ పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నేపథ్యంలో సోమవారం ఇక్కడ హరీశ్‌రావుతో రాజు భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. జనగాం, నర్సాపూర్, నాంపల్లి, గోషామహల్ అభ్యర్థుల ప్రకటనను సీఎం కేసీఆర్ పెండింగ్‌లో ఉంచారు. ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి స్థానంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, టీఎస్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాకిటి సునీత లక్ష్మారెడ్డిల స్థానంలో రైతుబంధు సమితి చైర్మన్, జనగాంకు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని చంద్రశేఖర్‌రావు ఖరారు చేసినట్లు పార్టీ వర్గాల సమాచారం. గోషామహల్, నాంపల్లి నియోజకవర్గాలకు చంద్రశేఖర్ రావు వరుసగా నంద్ కిషోర్ వ్యాస్ బిలాల్, మునుకుట్ల ఆనంద్ గౌడ్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు సమాచారం. ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. కిషోర్ గౌడ్ 2018లో ఓడిపోయారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటి శాఖ మంత్రి కేటీ రామారావు ఆగస్టు 20 నుంచి అమెరికా పర్యటనలో ఉన్నారు. సెప్టెంబర్ 1 నాటికి నగరానికి తిరిగి వస్తారని సమాచారం. కేటీఆర్ తిరిగి వచ్చిన తర్వాత మిగిలిన నలుగురు అభ్యర్థుల పేర్లను విడుదల చేస్తారు. యాదగిరిరెడ్డి, మదన్‌రెడ్డిలను పక్కన పెడితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య తొమ్మిదికి చేరుతుంది. హనుమంతరావును కూడా తొలగిస్తే ఆ సంఖ్య 10కి చేరుతుంది. ఆగస్టు 21న ప్రకటించిన అభ్యర్థుల జాబితా నుంచి ఏడుగురు ఎమ్మెల్యేలు గల్లంతయ్యారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కామారెడ్డి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ల పేర్లు తొలిజాబితాలో లేకపోయినా పార్టీ అధిష్టానం మాత్రం వారిని పక్కనపెట్టినట్లుగా భావించడం లేదు. విద్యాసాగర్ రావు అనారోగ్యాన్ని ఉదహరించారు. తన కుమారుడు కె. సంజయ్‌ను అభ్యర్థించాలని పార్టీని కోరారు. చంద్రశేఖర్ రావు గజ్వేల్‌తో పాటు రెండో స్థానంలో పోటీ చేసేందుకు గోవర్ధన్ కామారెడ్డికి దూరంగా ఉన్నారు.

# పేదలకు కార్పోరేట్ వైద్యం

### ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల - ప్రభాత సూర్యుడు



స్వరాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తుండడంతో సర్కారు దవాఖానల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతుందని, జిల్లా ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.. మంగళవారం జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జగిత్యాల మాతా శిశు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి నూతన అంబులెన్స్ ను మంజూరు చేయగా మంగళవారం అంబులెన్స్ ను మాతా శిశు ఆసుపత్రి ఆవరణ లో జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. జగిత్యాల జిల్లా కేంద్రానికి ముఖ్యమంత్రి కేసీఆర్ 500 కోట్ల తో మంజూరు చేసిన మెడికల్ కళాశాల పనులను ఎమ్మెల్యే పరిశీలించారు.. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ,మెడికల్ కళాశాల నిర్మాణం కోసం ముఖ్యమంత్రి ఇటీవల 200 కోట్ల రూపాయలు సైతం కేటాయించారని, నాణ్యతతో పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు...ఈ సందర్భంగా మాట్లాడుతూజగిత్యాల ను జిల్లాగా చేయటం తో ప్రజలకు అన్ని రకాల మెరుగైన పరిపాలన, సేవలు అందుతున్నాయిని,అలాగేమెడికల్ హబ్ గా జగిత్యాల మారిందన్నారు.ప్రతి పక్ష నాయకులు అసత్య ప్రచారాలు వల్ల పేద ప్రజలకు సర్కార్ వైద్యం అందకుండా చేస్తున్నారన్నారు..పల్లె,పట్టణ ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పల్లె,బస్తీ దవాఖానాలను తీసుకొచ్చిందని,ఒక్కో పల్లె దవాఖానకు రూ. 20 లక్షల వ్యయంతో పక్కా భవనాలు రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తుందన్నారు..పేద ప్రజలకు కూడా నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించేందుకు గాను, ఖర్చుతో కూడుకున్న వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేసే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ డయాగ్నస్టిక్స్ సెంటర్లను ఏర్పాటు చేసిందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 20 తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ లు సేవలందిస్తున్నాయిని,వీటిలో 134 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు.ఆరోగ్య శ్రీ పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం మరింత బలోపేతం చేసిందని,రాష్ట్రంలోని 90 లక్షలకుపైగా కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందాయిన్నారు..కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఆరోగ్యశ్రీ కింద ఉచిత డయాలసిస్ సేవలు అందిస్తున్నారని ,ఇందుకోసం 43 డయాలసిస్ కేంద్రాలు పనిచేస్తున్నాయిన్నారు..రాష్ట్రంలో తల్లి పిల్లల రక్షణ కోసం పెద్ద పీట అని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ జుంబర్తి రాజ్ కుమార్, సూపరింటెండెంట్ రాములు,ఆర్ఎంవో చంద్ర శేకర్, కౌన్సిలర్ లు కూతురు రాజేష్,కుసరి అనిల్,చుక్క నవీన్, నాయకులు సమిండ్ల శ్రీనివాస్,ఆనంద్ రావు, రామ్మోహన్రావు, ఓల్లెం మల్లేశం ,చందా పృథ్వీ, బ్రహ్మాండభేరి నరేష్,డిష్ జగన్,కోటేశ్వర రావు, లక్ష్మణ్,బిక్షపతి, ఉదయ్,శేఖర్, పవన్ గౌడ్,రాము , నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

### వాలంటరీ రిటైర్మెంట్‌కు

# దిశ అధికారి

(మొదటి పేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా స్పందన వచ్చింది. దేశంలో ఎక్కడా లేని విధంగా పోలీసులకు జై కొడుతూ, పూలు చల్లుతూ పెద్ద ఎత్తున పబ్లిక్ పోలీసులకు నీరాజనం పలికారు . అలాగే ఈ దిశ కేసులో తెలంగాణ పోలీసులు వ్యవహరించిన తీరుతో రాష్ట్ర పోలీసు ప్రతిష్ఠ పెరిగింది. మహిళల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం పోలీసుల పనితీరు చాలా ఆదర్శంగా ఉందంటూ అనేకమంది మెచ్చుకున్నారు. వీటన్నిటిని చూసిన అప్పటి ఆ కేసు ఇన్వెస్టిగేషన్ అధికారి తన భవిష్యత్తు అద్భుతంగా ఉంటుందని ఆశించాడు.కానీ ఆయన కష్టానికి దక్కాల్సిన ఫలితం దక్కకపోగా అంతా రివర్స్ అయింది. భరోసా నమ్మకం కల్పించాల్సిన పోలీస్ బాసుల మద్దతు దొరకపోవడంతో మౌనంగా ఉండిపోయాడు. దిశ ఎన్కౌంటర్ సమయంలో షాద్‌నగర్ ఏసిపి గా ఉన్న సురేందర్.. ఆ తర్వాత విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డీఎస్పీగా బదిలీ అయ్యారు. ఆ తర్వాత తిరిగి మంచి పోస్టింగ్ వస్తుందని అనుకున్నారు. కానీ సురేంద్రకు సైబరాబాద్ కమాండ్ కంట్రోల్ ఏసీపీగా బదిలీ చేశారు. దీంతో మనస్థాపానికి గురైన సురేందర్ తాను దిశ కేసులో ఇంతగా కష్టపడితే కనీసం మంచి పోస్టింగ్ ఇవ్వరా అంటూ వైరాగ్యంతో ఆయన వీఆర్ఎస్?కి అప్లై చేసుకున్నారు.ఎమ్మెల్యేల లెటర్స్ ఉంటేనే పోస్టింగ్స్.. పొలిటికల్ లీడర్ల ఆశీస్సులు ,ఎమ్మెల్యేల లెటర్లు ఉంటేనే పోలీసులకు పోస్టింగులు వస్తున్నాయంటూ ఒకవైపు పోలీస్ శాఖ పైన పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నవేళ దిశలాంటి సీరియస్ కేస్ని ఇన్వెస్టిగేషన్ చేసిన ఒక సీనియర్ డీఎస్పీ వీఆర్ఎస్ తీసుకోవడం తెలంగాణ పోలీస్ శాఖలో చర్చినీయాంశంగా మారింది.ఇదిలా ఉండగా 2019, నవంబర్ 28న వెటర్నరి వైద్యురాలిగా పనిచేస్తున్న ఓ యువతిని నలుగురు యువకులు రేప్ చేసి హత్య చేశారు. ఆ తర్వాత ఆమెను షాద్‌నగర్‌లోని చింతన్‌పల్లి వంతెన కింద ఆమె మృతదేహాన్ని కాలబెట్టారు. ఈ ఘటన అప్పట్లో రాష్ట్రంలోనే కాదు దేశవాప్తంగా దుమారం రేపింది. నిందితులను చంపేయాలంటూ అప్పుడు నెటిజన్లు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే సీన్ రీనకన్‌స్ట్రక్షన్ కోసం పోలీసులు నిందుతులను ఘటనా స్థలానికి తీసుకెళ్లారు. ఆ సమయంలో నిందితులను పోలీసులు షూట్ చేశారు. దీంతో పోలీసుల పనితీరును ప్రజలు ప్రశంసించారు.

### ప్రాణం పోయినా ఆ పార్టీల్లోకి వెళ్లను

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: బీజేపీ సస్పెండెడ్ నాయకుడు, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రాణం పోయినా తాను బీఆర్ఎస్ గానీ, కాంగ్రెస్ పార్టీలో గానీ చేరబోనని ప్రకటించారు. అంతే కాదు సెక్యూలర్ అని చెప్పుకునే ఏ పార్టీలోనూ తాను చేరే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సస్పెన్షన్ ఎత్తివేతపై బీజేపీ నాయకత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని రాజాసింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో గోషామహల్ నుంచే తాను ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని, మళ్లీ జయకేతనం ఎగురవేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఒకవేళ బీజేపీ తనకు టికెట్ ఇవ్వకుంటే కొన్నాళ్లు రాజకీయాలు పక్కన పెట్టి హిందూ రాజ్య స్థాపన కోసం కృషి చేస్తానని అన్నారు. బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు రాజాసింగ్. గోషామహల్ బీఆర్ఎస్ అభ్యర్థిని దారుసలామ్‌లో ఎంపిక చేస్తారని విమర్శించారు.

### రోడ్డును కబ్జా చేసి


## అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

### - బీఎస్పీ నాయకులు యంజాల ప్రహ్లాద్



**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు**

ప్రజా రవాణా వ్యవస్థకు ఆటంకం కలిగిస్తూ రోడ్డుకు అడ్డంగా ప్రహరీ గోడ నిర్మాణాలను చేపట్టిన అక్రమార్కులపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీఎస్పీ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కార్యదర్శి యంజాల ప్రహ్లాద్ డిమాండ్ చేశారు. పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధి 5వ వార్డులోని సర్వేనెంబర్ 309-320 సదాశివ వెంచర్లోని కొందరు ప్లాట్ల యజమానులు రోడ్డును కబ్జా చేసి ప్రజలు ఎవరు రాకుండా అడ్డంగా అక్రమంగా ప్రహరీ గోడ నిర్మాణాలు చేపట్టారని, ఇది పూర్తిగా మున్సిపల్ చట్టానికి విరుద్ధమని అన్నారు. దీనిపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు కమిషనర్ రవీందర్ రెడ్డి కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డొప్ప తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ నిర్మాణాల కట్టడిలో మున్సిపల్ అధికారులు విఫలం

- సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య
- మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా

**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు**





అడ్డు, అదుపు లేకుండా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ల కనుసన్నాల్లోనే జరుగుతున్నాయని, వీటిని నిలువరించడంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని సిపిఐ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ కార్యాలయం ముందు అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పార్టీ మండల సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డిలు మాట్లాడుతూ.. స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలో గత కొంతకాలంగా భారీ ఎత్తున అనుమతులు లేని నిర్మాణాలు జరుగుతున్న అధి కారులు మాత్రం అంటి ముట్టనట్టు వ్యవహరిస్తు న్నారని అన్నారు. ఎకరాల కొద్ది స్థలాల్లో అనుమతులు లేని భారీ షెడ్లను నిర్మిస్తున్న పట్టించుకోని మున్సిపల్ అధికారులు, పేదోడు ఇండ్లు నిరూపించుకుంటే మాత్రం నోటీసులు పంపిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాల విషయంలో ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధుల, మున్సిపల్ అధికారుల అండదండలతో అడ్డగోలుగా వేరుస్తున్న అక్రమ నిర్మాణాల వల్ల మున్సిపల్ ఆదాయానికి భారీ గండి పడుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

**మౌలిక సదుపాయాలు కల్పించాలి**

పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు పాపాయగూడ గ్రామ రెవిన్యూ పరిధిలోని భూదాన్ భూమిలో గత కొంతకాలం గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు త్రాగునీరు, బయో మరుగుదొడ్లను మానవతా దృక్పథంతో ఏర్పాటు చేయాలని సిపిఐ నాయకులు మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డిని కోరారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఆయన ఉన్నతాధికారులతో చర్చించి, మౌలిక సదుపాయాల ఏర్పాటు ప్రక్రియను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, సామిడి శేఖర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ హరి సింగ్ నాయక్, దిగోజు వేణుగోపాల చారి, ఏషాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించాలి

### ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి





**మంచాల - ప్రభాత సూర్యుడు:** తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళలకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం చిత్తాపూర్ గ్రామంలో షెడ్యూల్ కులాల, సావిత్రి బాయి మహిళ సేవా సహకార అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు మిషన్ల, సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని శిక్షణ పొందిన 140 మంది మహిళలకు కుట్టుమిషన్లను, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కిషన్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలని సూచించారు. అనంతరం మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ సత్తు వెంకటరమణ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు నాయకులు పాల్గొన్నారు.

## యోగేంద్ర యాదవ్‌ను కలిసిన శ్రీనివాస్ యాదవ్



సీసీ జాతీయ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ ప్రధాన సలహాదారులు యోగేంద్ర యాదవ్ హైదరాబాద్ పర్యటన ముగించుకుని ఢిల్లీకి తిరుగు ప్రయాణం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నేషనల్ కోఆర్డినేటర్, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అంబర్పేట్ శ్రీనివాస్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి వీడ్కోలు పలికారు. - **ప్రభాత సూర్యుడు, హైదరాబాద్**

## సిసి రోడ్డు పనులు పూర్తి



**కుత్బుల్లాపూర్ - ప్రభాత సూర్యుడు :** కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేట్ గ్రామం నుండి పోచమ్మ గుడి వరకు సిసి రోడ్డు పనులు పూర్తయ్యాయి. గత కొన్ని సంవత్సరాలుగా గుంతల మయంగా ఉన్న రోడ్లతో నానా అవస్థలు పడిన ప్రజలకు ఉపశమనం లభించింది. స్థానిక ప్రజాప్రతినిధులకు సహకారంతో ఎమ్మెల్యే వివేకానంద చొరవతో సుమారు 370 మీటర్ల పొడవు గల సీసీ రోడ్డు నిర్మాణ పనులును 35 లక్షల రూపాయల నిధులతో పూర్తి చేసినట్లు వర్క్ ఇన్స్పెక్టర్ భాస్కర్ తెలిపారు.

## చనిపోయిన రైతు కుటుంబాలకు అండగా రైతు సహకార సంఘం

### - చైర్మన్ లెక్కల విఠల్ రెడ్డి

**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు :** చనిపోయిన రైతు కుటుంబాలకు అండగా బాటసింగారం రైతు సేవా సహకార సంఘం ఉంటుందని చైర్మన్ లెక్కల విఠల్ రెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్ మెట్ మండలం మజీద్ పూర్ గ్రామానికి చెందిన సిలువేరు బాలయ్య భార్య సిలువేరు లక్ష్మమ్మ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మరణించింది. బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సభ్యులైన సిలువేరు లక్ష్మమ్మ కుటుంబ సభ్యులకు సంఘం చైర్మన్ లెక్కల విఠల్ రెడ్డి మంగళవారం 25 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. రైతు కుటుంబాలకు ఎల్లవేళలా సహకార సంఘం అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు చెరుకు కిరణ్ కుమార్ గౌడ్, పోచంపల్లి సుధాకర్ రెడ్డి, నాయకులు నార్ల కొండ జంగమయ్య యాదవ్, నారోజు రాజారాం చారి మరియు అకౌంటెంట్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలు విద్యార్థుల భవితకు పునాది

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు






**ఇబ్రహీంపట్నం - ప్రభాత సూర్యుడు**

క్రీడలు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు అవుతాయని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం పట్టణ కేంద్రంలోని గురుకుల విద్యాపీట్ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు మానసికోలాసాన్ని పెంపొందిస్తాయని, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎం కె ఆర్ ఫౌండేషన్ చైర్మన్ మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి 1200 క్రీడా దుస్తులను విద్యార్థులకు విరాళంగా అందజేశారు.

## నాణ్యత ప్రమాణాలు పాటించాలి

### కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్ నగర్ - ప్రభాత సూర్యుడు :** ప్రభుత్వ పనులలో కాంట్రాక్టర్లు తప్పక నాణ్యత ప్రమాణాలు పాటించాలని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని ఇన్ఫర్మేషన్ కాలనీలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. భవిష్యత్తులో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకొని, వీలైనంత త్వరగా డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు వాహిని, ప్రకాష్ మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## సర్కారు వైఫల్యాలపై టిడిపి నిరసన

**జగిత్యాల - ప్రభాత సూర్యుడు**

బీఆర్ఎస్ సర్కారు రాష్ట్రంలోని ప్రజలకు ఎన్నో హామిలిచ్చి విస్మరించిందని ప్రభుత్వ వైఫల్యాలను నివేధించాలని టిడిపి నేతలు కోరారు. మంగళవారం రాష్ట్ర సర్కారు వైఫల్యాలపై టిడిపి నేతలు నిరసనతో కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు మాట్లాడుతూ గత సాధారణ ఎన్నికల్లో, వివిధ సందర్భాల్లో సిఎం కెసిఆర్ సర్కారు రైతులకు, నిరుద్యోగులకు, మహిళలకు, మైనార్టీలకు, గిరిజనులకు, దలితులకు అనేక హామిలిచ్చిందన్నారు. ఏండ్లు గడుస్తున్నా హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. 22 లక్షల మంది ఇండ్లు లేని నిరుపేదలుంటే 3 లక్షల డబుల్ ఇండ్లు నిర్మిస్తామని చెప్పి పూర్తిస్థాయిలో నిర్మించక విఫలమైందన్నారు. స్వంత స్థలం ఉన్నోళ్లకు 5 లక్షలు ఇస్తామని ఇప్పుడు 3 లక్షల పేరుతో అమలు పనిని మూడు రోజులకే ముగించిందన్నారు. 2 లక్షల పోస్టులు ఖాళీ ఉంటే 80 వేలకు నోటిఫికేషన్ ఇచ్చి లీకుల పేరుతో యువతను మోసగిస్తోందన్నారు. రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేయలేదని దీంతో బ్యాంకులు వడ్డీతో ఇచ్చే రుణమాఫీ వడ్డీకే సరిపోతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను సత్వరమే అమలు చేసేలా ప్రభుత్వానికి నివేధించాలని టిడిపి నేతలు కోరారు. టిడిపి బిసి సెల్ ఉపాధ్యక్షులు ఓరుగంటి భార్గవ రామ్,టిడిపి రాష్ట్ర ఆర్గనైసింగ్ సెక్రటరీ అక్కిన పల్లి కాశినాథం, టిడిపి నాయకులు బత్తుల కొండయ్య యాదవ్, సోమ నారాయణ రెడ్డి ఉన్నారు.

## 9న జాతీయ లోక్ అదాలత్

**జగిత్యాల - ప్రభాత సూర్యుడు**

జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జగిత్యాల ఆధ్వర్యంలో అన్ని కోర్టులలో 9 సెప్టెంబర్ 2023 రోజున జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా న్యాయ సేవా అధికారి సంస్థ చైర్మన్ జగిత్యాల, జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు (దావాలు), కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటార్ వాహన చట్టంకు సంబంధించిన కేసులు, బ్యాంకు కేసులు, చిట్ ఫండ్ కేసులు ఇరుపక్షాల సమ్మతితో పరిష్కరించబడునని.. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని జిల్లా న్యాయమూర్తి నీలిమ కోరారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215